

# కెరటాలు

సాయి వర్కింగ్ వుమెన్స్ హాస్టల్ సందడిగా ఉంది. ఉదయం తొమ్మిదిన్నర దాటింది. ఆఫీసుల్లో పనిచేస్తున్న వాళ్ళంతా బాక్సులు సర్దుకుని హడావిడిగా బయల్దేరుతున్నారు.

అరుణ తన పదేళ్ళ కూతురు శిల్పను స్కూలుకి పంపించి ఆఫీసుకు వెళ్ళడానికి రెడీ అవుతోంది.

"అమ్మా ! మీ కోసం ఎవరో వచ్చారు?" అన్నది హాస్టల్ అటెండర్ కమలమ్మ.

"ఎవరూ?"

"ఎవరో ముసలాయనమ్మా ! గెస్ట్‌రూమ్‌లో కూర్చున్నారు" చెప్పి వెళ్ళిపోయింది కమలమ్మ.

అరుణ గెస్ట్‌రూముకి వెళ్ళిచూసేసరికి మామగారు సోఫాలో కూర్చుని టివి చూస్తూ కనిపించారు.

"నమస్కారం మావయ్యా !" అన్నది అరుణ.

"అరుణా ! ఏమిటమ్మా ఈ పని? నిన్నిక్కడ చూస్తాననుకోలేదు" నిష్ఠూరంగా అన్నాడు వెంకట్రావు.

అరుణ కొంచెంసేపు మౌనంగా వుండిపోయింది.

"వూరి నుండి ఎప్పుడొచ్చారు?" అన్నది.

"రాత్రే వచ్చానమ్మా !" అన్నాడు.

"కూర్చోండి కాఫీ పంపిస్తాను" అన్నది అరుణ.

"ఇప్పుడు కాఫీ వద్దమ్మా ! రాత్రి నుంచి నా మనసేం బాగాలేదు. నువ్వు వస్తూ వస్తూ శిల్పను గూడా తీసుకొచ్చేశావట గదా?"

"అవును మావయ్యా !"

"నేను వచ్చేవరకూ ఆగవలసిందమ్మా ! ఎందుకు అంత తొందతపడ్డావు?"

"మీ అబ్బాయే తొందరపడ్డారు మావయ్యా ! అంత జరిగాక ఇక ఆ ఇంట్లో వుండాలనిపించలేదు. నేను తొందరపడ్డానని మీరు భావిస్తే నన్ను క్షమించండి మావయ్యా!" అన్నది అరుణ.

"నీ అభిమానం నాకు తెలుసు. కాని మన ఇంటి పరువు గురించి కూడా ఆలోచించాలి గదా !"

"ఇంట్లో మనిషి పరువు తీస్తున్నప్పుడు ఇంటి పరువు గురించి ఆలోచించి వుంటే బాగుంటుంది మావయ్యా !" అన్నది అరుణ.

"నీకు తెలుసు కదా ! కృష్ణకి తొందరపాటు ఎక్కువ. జరిగిన దానికి వాడూ బాధ పడుతున్నాడు. పెళ్ళయిన పన్నెండేళ్ళ తర్వాత భార్యాభర్తలు విడిపోవటం చాలా బాధాకరం."

"మావయ్యా ! నాకు ఆఫీస్ టైమ్ అవుతోంది. తర్వాత మాట్లాడదాం" అన్నది అరుణ.

తనను వెళ్ళిపొమ్మని పరోక్షంగా చెప్తున్నట్లు అర్థమైంది వెంకట్రావుకి.

"ఈ పూటకి సెలవు పెట్టరాదా?"

"లేదు మావయ్యా ఆఫీసులో అర్జెంట్ పని ఉంది. ఇంపార్టెంట్ ఫైల్స్ నా దగ్గరే వున్నాయి" అన్నది అరుణ.

"సరేనమ్మా ! నేను మళ్ళీ సాయంకాలం వస్తాను. నువ్వులేని ఇల్లు బోసిపోయి వుందమ్మా ! శిల్ప వున్నంతసేపూ అల్లరిచేస్తూ చెంగు చెంగున తిరుగుతూ వుండేది. ఇప్పుడేమో ఇల్లు నిశ్శబ్దంగా మనుషులు లేనట్లుగా వుంది. పిల్లలులేని ఇల్లు స్మశానం లాంటిదని ఎవరు చెప్పారోగాని నిజమేనమ్మా !" అన్నాడు వెంకట్రావు.

అరుణ మౌనంగా వుండిపోయింది.

వెంకట్రావు నెమ్మదిగా లేచి బయల్దేరాడు. అరుణ ఆయన్ని గేటువరకూ సాగనంపి వచ్చింది.

★ ★ ★

ఆ రోజు ఆఫీసుకి వెళ్ళిందన్న మాటేగాని అరుణ పనిమీద దృష్టి కేంద్రీకరించిలేక పోయింది. చేసిన పనులన్నీ తప్పుల తడకలే. ఆఫీసు సూపరింటెండెంట్ అడగనే అడిగారు "ఏవమ్మా ! వంట్లో బాగా లేదా?" అని.

వంట్లో బాగానే ఉంది కాని మనసే బాగాలేదు అని చెప్పలేకపోయింది.

"అవును సార్ ! తలనొప్పిగా ఉంది. పడిశం పట్టింది" అన్నది.

"పడిశం పడితే అంతే మరి. తల పగిలిపోతుంది. బుర్రపని చేయదు. అందుకే పడిశం పదిరోగాల పెట్టు అన్నారు. పర్మిషన్ పెట్టి ఒక గంట ముందు వెళ్ళిపో" అన్నాడు.

'హమ్మయ్య' అనుకుని పర్మిషన్ లెటర్ రాసిచ్చి హాస్టల్‌కి బయల్దేరింది.

హాస్టల్‌కి వచ్చిన తర్వాత కాఫీ తాగి రూమ్‌లో కూర్చుని టి.వి. ఆన్ చేసింది. చూడబుద్ధి కాలేదు.

'సాయంకాలం మావయ్య మళ్ళీ వస్తాడు. ఆయనకి ఏం చెప్పాలి?' అని ఆలోచనలో పడిపోయింది.

ఇటువంటి పరిస్థితి వస్తుందని తను ఎప్పుడూ అనుకోలేదు. అనుకున్నవి జరగక పోవడం, అనుకోనివి జరగడమే జీవితం కాబోలు.

సీతారామయ్యకి ఇద్దరే పిల్లలు. మోహన్ పెద్దవాడు. అరుణ చిన్నది. సీతారామయ్య చదువుకోలేదు. తాపీ మేస్త్రీగా పనిచేసేవాడు. 'మేస్త్రీగారూ' అంటూ అంతా ఆయన్ని గౌరవించేవారు. ఎప్పుడూ కష్టపడి పనిచేస్తూనే ఉండేవాడు. తను చదువుకోకపోయినా పిల్లల్ని బాగా చదివించాలనే పట్టుదలతో వుండేవాడు. 'అంతంత డబ్బు ఖర్చుపెట్టి పిల్లల్ని చదివించడం ఎందుకూ? మోహన్‌కి మీ పని నేర్పరాదా? హాయిగా గడిచిపోతుంది. ఎంత చదివినా వుద్యోగం వస్తుందో రాదో?" అని భార్య అనేది.

"నా పిల్లలు నాలా కష్టపడగూడదే. చదువుకున్నవాడికి ఏదొక ఉద్యోగం వస్తుంది. నాకు ఆ నమ్మకం వుంది" అనేవాడు.

సీతారామయ్య నమ్మకం వమ్ము కాలేదు. మోహన్‌కి ఇరిగేషన్లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం వచ్చింది. అరుణ ఎమ్మెస్సీ ప్యాసై అగ్రికల్చరల్ డిపార్ట్‌మెంట్లో జాబ్ సంపాదించింది. తన శ్రమకు తగిన ఫలితం దక్కినందుకు ఎంతో సంతోషించాడు సీతారామయ్య. పిల్లలిద్దరికీ పెళ్ళిళ్ళు చేశాడు.

పదిహేను సంవత్సరాలు సంతోషంగానే గడిచింది. సీతారామయ్య భార్య చని పోయింది. వృద్ధాప్యంలో తోడుగా వుండవలసిన భార్య పోవడంతో మానసికంగా కుంగి పోయాడు. పనిచేసే శక్తి కూడా సన్నగిల్లింది. కష్టాలు ఒంటరిగా రావని భార్య మరణంతోనే దిగులుపడుతున్న సీతారామయ్యకి కొడుకు యాక్సిడెంట్‌కి గురికావడంతో విలవిలలాడి పోయాడు. ఆఫీసుకి వెళ్ళివస్తున్న మోహన్ కారు యాక్సిడెంట్‌లో చనిపోయాడు. మోహన్ భార్య రాజేశ్వరికి ఆఫీసులో ఉద్యోగం ఇచ్చారు.

కొంతకాలం మావగారిని బాగానే చూసింది రాజేశ్వరి. తర్వాత ఆమె పనిచేస్తున్న ఆఫీసులోనే ఒక యువకుడితో అక్రమ సంబంధం పెట్టుకుంది. అతను ఇంటికి రావడం పోవడం సీతారామయ్యకు నచ్చలేదు. అందుకని రాజేశ్వరి ఆయన్ని వృద్ధాశ్రమంలో చేర్పించి నెల నెలా డబ్బుపంపే ఏర్పాటుచేసింది. సీతారామయ్య ఆశ్రమంలో కృష్ణారామా అనుకుంటూ కాలం గడుపుతున్నాడు. 'దేవుడా ! నన్ను తొందరగా తీసుకొనిపో, నాకు విముక్తి ప్రసాదించు' అని కోరుకుంటూనే ఉన్నాడు.

సంవత్సరం తర్వాత తను ఒక డబ్బు పంపలేదని రాజేశ్వరి మావగారికి ఉత్తరం రాసింది. పిల్లల్ని హాస్టల్లో చదివిస్తున్నాననీ, ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయనీ, నెల నెలా రెండు వేలు పంపడం సాధ్యంకాదనీ తెలిపింది. కాబట్టి ఇంటికి వచ్చేయండి ఏదో వున్నంతలో జరుపుతాను అన్నది.

కాని సీతారామయ్యకు మళ్ళీ కోడలి ఇంటికి వెళ్ళడం ఇష్టంలేదు. అక్కడి పరిస్థితులు తెలుసు. చూస్తూ భరించలేదు.

అరుణ తండ్రిని చూడడానికని ఆశ్రమం వెళ్ళినప్పుడు ఆమెకు అన్ని విషయాలు తెలిశాయి.

ఆమెకు వదినమీద కోపం రాలేదు. కోపగించి ప్రయోజనం లేదు. బంధువులలో అల్లరి అవడం తప్ప వేరే వుపయోగం లేదు.

"నాన్నా ! అన్నయ్య మనవాడని వదిన మనది కాదు. దేవుడే అన్నయ్యను తీసుకెళ్ళి మనకి అన్యాయం చేశాడు. ఇక ఎవర్నీ ఏమనీ ప్రయోజనం ఏముంది? నువ్వు మళ్ళీ వదిన దగ్గరికి వెళ్ళవలసిన అవసరంలేదు. ఆశ్రమానికి నేనే డబ్బు పంపిస్తాను" అన్నది అరుణ.

ఐతే సీతారామయ్య ఒప్పుకోలేదు నావల్ల నీ సంసారంలో కలతలు రాకూడదమ్మా పరాయి ఇంటికి వెళ్ళిపోయావు. నాకు డబ్బు పంపిస్తుంటే మీ అత్తగారింట్లో వాళ్ళకి ఇష్టం వుండదు. నేను నా తిప్పలు ఏదో పడతాను' అన్నాడు.

కాని అరుణ సర్దిచెప్పింది.

సీతారామయ్య అనుభవంతో చెప్పిన మాటలే నిజమయ్యాయి. అరుణ అత్త కామాక్షి విషయం తెలిసి మండిపడింది.

"కట్నం తక్కువైనా వుద్యోగం చేస్తున్నావని చేసుకున్నాం. ఇప్పుడు నెలనెలా రెండు వేలు మీ నాన్నకు పంపడం ఏమిటి? ఎక్కడైనా ఇలా జరుగుతుందా?" అన్నది.

"ఒకళ్ళతో పోలికేమిటి అత్తయ్యా ! ఎవరి పరిస్థితులు వాళ్ళవి. మా నాన్నకు నేను సంపాదించిన దాంట్లో పంపుతున్నాను. ముసలితనంలో బిడ్డలు ఆదుకోవడంలో తప్పేముంది?" అన్నది అరుణ.

కష్టాలు అనుభవించని వారికి ఎదుటివారి కష్టాలు అర్థం చేసుకునే సహృదయం ఉండదు. వాళ్ళ ధోరణి వాళ్ళదే. కామాక్షి అదే ధోరణితో, అత్తగారిననే అహంకారంతో ఏకపక్షంగా దాడికి దిగింది. అరుణ వూరుకోలేదు. మాటా మాటా పెరిగింది.

ఆమె భర్త కృష్ణ వచ్చిన తర్వాత గూడా మాటల యుద్ధం కొనసాగింది. కామాక్షి ఆఖరి అస్త్రంగా ఏడుపు మొదలుపెట్టి కుండలకొద్దీ కన్నీళ్ళు కార్చింది. తల్లి ఇగోను తృప్తి పరచడానికి కృష్ణ భార్యమీద చేయిచేసుకున్నాడు.

అంతే ! అప్పట్లో హాస్టల్లో వుంటున్న కొలీగ్‌కి ఫోన్‌చేసి, కూతుర్ని తీసుకుని వెళ్ళిపోయింది అరుణ. మావగారు ఇంట్లో వుంటే అంతవరకూ వచ్చేది కాదు. ఆయన లేకపోవటం వలన దురదృష్టకరమైన సంఘటనలు జరిగాయి. గిల్టీకాంప్లెక్స్‌తో వున్న కృష్ణ ఆమెను అడ్డుకోలేకపోయాడు. అత్తగారిననే అహంకారంవల్ల కామాక్షి కోడలు వెళ్ళిపోతుంటే చూస్తూ వూరుకుంది.

"అమ్మా ! మీ కోసం పొద్దున వచ్చిన అయ్యగారొచ్చారు" చెప్పింది అటెండర్.

అరుణ ఉలిక్కిపడి ఆలోచనల్లోంచి తేరుకుంది.

"ఏంటమ్మా ! చీకటిపడినా లైటేసుకోలేదు" అని స్విచ్‌వేసి వెళ్ళింది అటెండర్.

విజిటర్స్ రూమ్‌కి వెళ్ళింది అరుణ. అక్కడ తాతగారి ఒళ్ళో కూర్చుని కబుర్లు చెప్తోంది శిల్ప.

"ఎంత సేపైంది మావయ్యా మీరొచ్చి" అన్నది అరుణ తనూ కూర్చుంటూ.

"ఇప్పుడేనమ్మా !" అన్నాడు వెంకట్రావు.

"శిల్పా నువ్వు రూమ్‌కెళ్ళి ముఖం కడుక్కో ! ఆంటీ టిఫిన్ పెడుతుంది తిను. నేను తాతగారితో మాట్లాడుతుంటాను" అన్నది అరుణ.

శిల్పకు తాతను వదలివెళ్ళడం ఇష్టంలేదు.

"మమ్మీ ! మనం తాతయ్యతో ఇంటికి వెళ్దాం" అన్నది.

"నిన్ను వెళ్ళమని చెప్పానా? చెప్పిన మాట విను" అని కోపంగా చూసింది అరుణ.

"మిమ్మల్ని ఇంటికి తీసుకెళ్ళడానికేగా నేను వచ్చింది. శిల్పా నువ్వెళ్ళి టిఫిన్ తినిరా. నేనిక్కడనే వుంటాను మా బుజ్జిగదూ !" అన్నాడు వెంకట్రావు.

శిల్ప అయిష్టంగానే అక్కడ్నుంచి కదిలింది.

"చెప్పండి మావయ్యా !" అన్నది అరుణ.

"నేను చెప్పేది ఏముందమ్మా? నువ్వు చదువుకున్న దానివి. వివేకం కలదానివి. సంసారం సాగరం అన్నారు పెద్దలు. సంసారం చెయ్యడమంటే సముద్రంతో సహజీవనం చెయ్యడమే. సముద్రం నిరంతరం కెరటాలతో వువ్వెత్తున లేస్తూ, పడుతూ వుంటుంది. అందులో చేపలతో పాటు పాములు, మొసళ్ళు, తిమింగలాలు కూడా వుంటాయి. అందుకని భయపడి సముద్రస్నానం చెయ్యకుండా వుండలేం. సంసారంలో కూడా సముద్రపు కెరటాల వలె స్పర్థలు వస్తుంటాయి. అనుకోకుండా దురదృష్టకరమైన సంఘటనలు జరుగు తుంటాయి. సర్దుకుపోవాలమ్మా !" అన్నాడు వెంకట్రావు.

"ఈ సంగతి మీ అబ్బాయికి, అత్తయ్యకి చెప్పవలసింది మావయ్యా !"

వెంకట్రావు నవ్వాడు.

"చెప్పకుండా ఎలా వుంటానమ్మా? నాది చెప్పే వయసేగాని చేసే వయసు కాదు. అయినా మీ సంసారంలో కలతలు రాకుండా వుండడానికి ఒక పనిచెయ్యాలని నిర్ణయించుకునే వచ్చాను."

"మావయ్యా ! నేను ఏ విషయంలోనైనా సర్దుకుపోతాను కాని మా నాన్నకి నెల నెలా ఆశ్రమంలో వుండే ఖర్చుకి డబ్బు పంపిస్తూనే వుంటాను. ఆ విషయంలో రాజీ పడను" స్థిరంగా అన్నది.

"ఎవరొద్దన్నారు? పంపించవమ్మా ! మీ అత్తయ్య అనాలోచితంగా నిన్ను అభ్యంతర పెట్టింది. ఆమెది తప్పని నేను ఒప్పుకుంటాను. నువ్వు సంపాదించిన డబ్బులో కొంత కన్నతండ్రికి పంపించడంలో తప్పులేదు. ముసలితనంలో వున్న తండ్రికి సాయపడడం కర్తవ్యం గూడా !" అన్నాడు వెంకట్రావు.

అరుణ ఏమీ మాట్లాడలేదు.

"ఇన్నాళ్ళూ మీ అత్తాకోడళ్ళ మధ్య ఇంత తీవ్రంగా పొరపొచ్చాలు ఎప్పుడూ రాలేదు. మనసులు కలవనప్పుడు విడిగా వుండడమే వుత్తమం. అందుకని నేనొక నిర్ణయానికి వచ్చాను."

"ఏమిటి మావయ్యా?"

"నేను మీ అత్తగారు వృద్ధాశ్రమానికి వెళ్ళిపోతాం. నాకు పెన్షన్ వస్తుంది. సరిపోతుంది. నేను పోయినా మీ అత్తగారికి ఫ్యామిలీ పెన్షన్ వస్తుంది బాధలేదు. నువ్వు అన్నీ మర్చిపోయి ఇంటికి వచ్చేయమ్మా !" అన్నాడు వెంకట్రావు.

అరుణ తలవంచుకుని కూర్చుంది. మౌనంగా వున్నది. ఏమీ మాట్లాడ్డంలేదు. వెంకట్రావు కోడలి రియాక్షన్ కోసం ఎదురు చూస్తున్నారు.

"మాట్లావవేనమ్మా ! ఇంతకంటే నేను చేసేదేవుంది?" అని నిట్టూర్చాడు బాధగా.

"ఇంతకీ ఆయనేరి మావయ్యా?"

"వాడికి నిన్ను చూడ్డానికి మొఖం చెల్లక బైట నిల్చున్నాడమ్మా !" అన్నాడు వెంకట్రావు.

అరుణ దిగ్గునలేచి చరచరా నడిచి హాస్టల్ గేటు దగ్గరికి వెళ్ళింది. గేటు బైట నిలబడి వున్నాడు కృష్ణ.

"సారీ ! అరుణా !" చూస్తూనే అన్నాడు కృష్ణ.

"లోపలికి రండి" అతని చెయ్యి పట్టుకుంది.

కృష్ణలో టెన్షన్ మాయమైంది. హాయిగా వూపరి పీల్చి అరుణ వెంట హాస్టల్లోకి బయల్దేరాడు.

"డాడీ !" అంటూ దగ్గరికి వచ్చి కృష్ణను చుట్టుకుంది శిల్ప.

కృష్ణ కూతుర్ని ఎత్తుకుని ముద్దులాడాడు.

"మావయ్య ఏదో చెప్తున్నారు మీకు తెలుసా?" అడిగింది అరుణ.

"ఔను అరుణా ! అమ్మ, నాన్న ఆశ్రమానికి వెళ్ళిపోతామంటున్నారు. నీకు ఇష్టమేనా?" అన్నాడు కృష్ణ.

"సమస్యను పక్కదారి పట్టిస్తున్నారెందుకు?" ప్రశ్నించింది అరుణ.

తండ్రీ కొడుకులు ఒకరి ముఖం మరొకరు చూసుకున్నారు.

"ఏమిటి అరుణా?" అడిగాడు కృష్ణ.

"ఔనండీ ! అసలు సమస్య ఏమిటి? అడిగింది అరుణ.

"అమ్మకి నీకు పడడంలేదు" అన్నాడు కృష్ణ.

"మాకు పడకపోవడం ఏమిటి? నేను కొత్తగా కాపురానికి వచ్చానా? పన్నెండేళ్ళ నుంచి కలిసి వుంటునానం గదా?" అన్నది అరుణ.

"మరేమిటి?" ఆశ్చర్యంగా అన్నాడు కృష్ణ.

"నేను మా నాన్నకు డబ్బు పంపడం గురించి కదా గొడవ బయల్దేరింది. ఈ విషయంమీద గదా మాటా మాటా అనుకున్నాం. ఆ సమస్య మావయ్య పరిష్కరించేశారు."

"అయినా..."

"అత్తయ్య, మావయ్య ఆశ్రమానికి వెళ్ళడానికి నేను ఒప్పుకోను. అలా జరిగితే నేను ఇంటికి రాను" అన్నది అరుణ.

కృష్ణ సంభ్రమాశ్చర్యాలతో భార్యవైపు చూశాడు. వెంకట్రావు వుప్పొంగిపోయాడు.

"పదమ్మా ఇంటికి వెళ్దాం" అన్నాడు ఆనందంతో వుక్కిరిబిక్కిరవుతూ

అరుణ హాయిగా నవ్వింది.

*–జాగృతి, వారపత్రిక జనవరి, 2007*